క్లుప్తంగా

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



దోమకొండ: రానున్న స్థానిక సంస్థల ఎన్నిల్లో పార్టీ నాయకులు సత్తా చాటాలని బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పెద్దమ్మ ఫంక్షన్ హాలులో బీజేవైఎం కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో వార్డు మెంబర్ నుంచి ఇతర అన్ని రకాల పదవుల్లో పార్టీ నాయకులు పోటీ చేయాలన్నారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు కంది మనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి



భిక్కనూరు: సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న ఆయనను భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా నియమితులైన బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి సన్మానించారు. తనకు పదవిని కట్టబెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు రాజు, కాంగ్రెస్ నేతలు వినోద్‌గౌడ్, శశికుమార్, కొండల్‌రెడ్డి, యాదిరెడ్డి, లక్ష్మణ్, కిషన్‌రావులున్నారు.

వైస్ ప్రిన్సిపాల్‌గా రాంబాబు



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయం వైస్ ప్రిన్సిపాల్‌గా ఎస్‌ఎం. రాంబాబు బాధ్యతలు తీసుకున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని కొలార్ నవోదయ విద్యాలయం నుంచి రాంబాబు ఇక్కడికి వైస్ ప్రిన్సిపాల్‌గా బదిలీపై వచ్చారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



పిట్లం(జుక్కల్): చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల విద్యాశాఖ అధికారి దేవిసింగ్ పేర్కొన్నారు. ఆయన సోమవారం గౌరారం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల కనీస అభ్యాసన స్థాయిని పరిశీలించారు. బేస్ లైన్ టెస్ట్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్, సిబ్బంది ఎల్లయ్య, ధనుంజయ్, కృష్ణారెడ్డి, సంధ్య, సంధ్యారాణి, తదితరులున్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన



నస్రుల్లాబాద్: మండలంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాధవ రావు మాట్లాడుతూ.. ఈ నెల 28న కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కామారెడ్డి ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్స్ సెలక్షన్‌లో విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. దీనిలో భాగంగా అండర్-14 విభాగంలో రాణా ప్రతాప్, ఈశ్వర్, యోగి అండర్-12 విభాగంలో దేవిదాస్, చందర్నాన, విశ్వాస్ పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రాహుల్, పోశెట్టి, ఉపాధ్యాయులు ప్రవీణ్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు డెస్క్‌ల వితరణ



బాన్సువాడ రూరల్: మండలంలోని సోమేశ్వర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతో సోమవారం పీఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత పోచారం సురేందర్‌రెడ్డి డ్యూయల్ డెస్క్‌లను అందజేశారు. భవిష్యత్తులో పాఠశాలకు కావాల్సిన ఇతర మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. నాయకులు కొల్లూర్ మహేందర్‌రెడ్డి, ఎంఈవో నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు మహేందర్ పాల్గొన్నారు.

పర్మళ్లలో వైద్య శిబిరం

లింగంపేట(ఎల్లారెడ్డి): పర్మళ్లలో సోమవారం ఏఎన్‌ఎం రాధిక గ్రామస్తులకు, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి పరీక్షలు నిర్వహించి 30 మందికి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. పలు సూచనలు చేశారు. ఆమె వెంట కార్యదర్శి రాజ్యలక్ష్మి, సిబ్బంది, ఆశ వర్కర్లు ఉన్నారు.

అంగన్‌వాడీ భవనాలకు మోక్షమెప్పుడో..?

- అద్దె భవనాల్లో 83 కేంద్రాలు
- మౌలిక వసతులూ కరువే..
- ఇబ్బందులు పడుతున్న అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు



ధర్మారావ్‌పేట్‌లో అసంపూర్తిగా ఉన్న భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కార్పొరేట్‌కు దీటుగా విద్యా బోధన అందించాలనే ఉద్దేశంతో నెలకొల్పిన అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. గతంలో భవనాల నిర్మాణం కోసం కేటాయించిన నిధులు సరిపోకపోవడంతో ఆ భవనాలను అసంపూర్తిగానే వదిలేశారు. కొన్ని సంవత్సరాలుగా అసంపూర్తి భవనాలకు నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో తప్పని పరిస్థితుల్లో అసంపూర్తిగా ఉన్న భవనాల్లోనే కేంద్రాలను కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. కేంద్రాల్లో కనీస వసతులు లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. సదాశివనగర్, రామారెడ్డి, తాడ్వాయి, కామారెడ్డి మున్సిపాలిటీల పరిధిలో 249 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో 7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 8,219 మంది, 3-6 సంవత్సరాల పిల్లలు 8,023, గర్భిణులు 1,814, బాలింతలు 1,432 ఉన్నారు. కాగా 126 అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనాల్లో కొనసాగుతున్నప్పటికి కనీస వసతులు లేకపోవడంతో సమస్యలు తలెత్తున్నాయి. 83 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దెభవనాల్లో కొనసాగుతుండగా, ఫ్రీ రెంట్ కింద 40 కేంద్రాలు కొనసాగుతున్నాయి. 26 కేంద్రాలు నిర్మాణంలో ఉన్నాయి. మరో తొమ్మిది కేంద్రాలు మంజూరైనప్పటికి పనులు ప్రారంభం కాలేదు. అసంపూర్తి భవనాలకు కిటికీలు లేకపోవడంతో వర్షానికి నిత్యావసర వస్తువులు తడుస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నాయి. వర్షాకాలం సమీపించడంతో పాములు, విష పురుగుల బెడద ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది.

నిధులు కేటాయించాలి



అసంపూర్తి అంగన్‌వాడీ భవనాలతో ఇబ్బందులు తప్పడం లేదు. అరకొర వసతుల మధ్యే చిన్నారులకు చదువు నేర్పించాల్సి వస్తోంది. పాలకులు నిధులు కేటాయించి పూర్తి చేయాలి.

-సుగుణ, అంగన్‌వాడీ టీచర్, ధర్మారావ్‌పేట్

నివేదికలు పంపాం

సొంత భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. త్వరలో నిధులు వచ్చే అవకాశం ఉంది. నిధులు రాగానే మొదటి ప్రాధాన్యతగా అసంపూర్తిగా ఉన్న కేంద్రాల పనులు పూర్తి చేయిస్తాం. కేంద్రాల వద్ద పరిశుభ్రత పాటించేలా దృష్టి సారిస్తాం.

-శ్రీలత, ఐసీడీఎస్ సీడీపీవో

నిరుపయోగంగా చెత్త రిక్షా

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మోడెగాంలో చెత్త రిక్షాలపై చిత్త శుద్ధి లేకుండా పోయింది. గ్రా మంలోని శ్మశాన వాటికకు సమీపంలో రోడ్డు పక్కన ఇలా పడేశారు. గతంలో ప్రభుత్వం పంపిణీ చేసిన చెత్త రిక్షాలు ఇలా తుప్పు పట్టి పోయి పనికి రాకుండా పోయాయి.



మోడెగాంలో పక్కకు పడేసిన చెత్త రిక్షా

సంఘాల బలోపేతానికి కృషి చేయండి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామ సంఘాల బలోపేతానికి కృషి చేయాలని ఏపీడీ విజయలక్ష్మి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వీవోఏల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. పుస్తకాల నిర్వహణ తీరు, అకౌంటింగ్, యాప్ లావాదేవీలను నమోదు చేసే విధానంపై అవగాహన కల్గి ఉండాలన్నారు. బ్యాంక్ రుణాలను ప్రతి గ్రామ సంఘానికి ఇప్పించాలన్నారు. బ్యాంక్ లింకేజీలో ఎన్‌పీఏ లేకుండా చూడాలన్నారు. ఏపీఎం రాజిరెడ్డి, స్త్రీనిధి ఆర్‌ఎం కిరణ్, సీసీలు రాములు, ఆంజనేయులు, లింగం, నరేందర్ రెడ్డి, కృష్ణాంజలి, సౌజన్య, అకౌంటెంట్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు సప్లయర్లుగా మారిన వేళ

నస్రుల్లాబాద్: నెమ్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం అదనపు తరగతి గదుల ప్రారంభ కార్యక్రమానికి హాజరైన గ్రామస్తులకు విద్యార్థులే బిస్కెట్లు అందించారు. తోటి విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొంటే పదవ తరగతి విద్యార్థులు మాత్రం అందరికి స్నాక్స్ అందిస్తూ కనిపించారు. పీఎం శ్రీ నిధులు ఉండగా కూడా స్కావెంజర్లు, సప్లయి చేయించడానికి పనివారిని పెట్టకపోవడం గమనర్హం. ఒక వైపు విద్యార్థులే దేశానికి భవిష్యత్తు అంటూ ముఖ్య అతిథులు ఉపన్యాసాలిస్తుంటే తోటి విద్యార్థులు ఇలా కనిపించడం ఏంటని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.



గ్రామస్తులకు బిస్కెట్లు అందిస్తున్న విద్యార్థినులు

విధులు సక్రమంగా నిర్వహించండి



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం మండల సమాఖ్య అధ్యక్షురాలు రేణుక ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులకు విధులు, బాధ్యతలపై మొదటి బ్యాచ్ శిక్షణను సీఆర్‌పీలు జంగమ్మ, నర్సింగమ్మలు వివరించారు. గ్రామ సంఘాల నిర్వహణ, ఆర్థిక నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ అందించినట్లు వారు తెలిపారు. రవీందర్, సీసీలు, గ్రామ సంఘాల పాలకవర్గ సభ్యులున్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

బీబీపేట: వర్షాకాలంలో రోగాలు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎప్పటికప్పుడు ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో అబ్బాగౌడ్, కార్యదర్శి రమేష్ ఉన్నారు.



పరిశీలిస్తున్న ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్

సమయపాలన పాటించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని నాగిరెడ్డిపేట ఎంఈవో భాస్కర్‌రెడ్డి సూచించారు. చీనూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాగా పాఠశాలలో ప్రార్థన సమయానికి ఒక ఉపాధ్యాయుడు లేకపోవడాన్ని అయన గుర్తించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులందరూ ప్రార్థన సమయానికి విధులకు హాజరవ్వాలని ఆదేశించారు. విధులపట్ల నిర్లక్ష్యం చేసే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పలు సూచనలిచ్చారు.



ప్రార్థనలో పాల్గొన్న ఎంఈవో భాస్కర్‌రెడ్డి

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి



బిచ్కుంద(జుక్కల్): స్కూల్ పరిసరాలలో మురికి నిలువ ఉండకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఖయ్యూం అన్నారు. సోమవారం మైనారిటీ స్కూల్ సందర్శించి పరిసరాలు పరిశీలించారు. బాత్‌రూంలు,టాయిలెట్లు శుభ్రంగా ఉండేలా చూడాలని ప్రిన్సిపాల్ సునీతకు సూచించారు.అనంతరం వంటగది పరిశీలించి సూచనలు,సలహాలిచ్చారు.

ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ సహజం



ఎస్సైని సన్మానిస్తున్న ఏఎస్పీ నరసింహారెడ్డి

కామారెడ్డి క్రైం: ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ సహజమని ఏఎస్పీ నరసింహ రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లాలో 18 నెలలుగా విధులు నిర్వహిస్తూ సోమవారం పదవీ విరమణ పొందిన నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డిని జిల్లా పోలీసు కార్యాలయంలో సన్మానించారు.1985లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన మల్లారెడ్డి ఎంతో నిజాయితీగా, క్రమశిక్షణతో సేవలు అందించారని ఏఎస్పీ తెలిపారు. కుటుంబంతో కలిసి సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. సీఐలు మురళి, నవీన్ కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

'బాలు'కు రోటరీ క్లబ్ ఎక్సలెన్సీ అవార్డు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన రక్తదాతల సమూహ నిర్వాహకుడు బాలు రోటరీ క్లబ్ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు అవార్డును అందజేసి ఘనంగా సత్కరించారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం 3,500 యూనిట్ల రక్తాన్ని సేకరించడమే కాకుండా స్వయంగా 76 సార్లు రక్తదానం చేసినందుకు అభినందించారు.



అవార్డు అందజేస్తున్న రోటరి క్లబ్ ప్రతినిధులు

నిరుపేదలకు ఇళ్ల పట్టాలివ్వండి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని 170, 174 సర్వే నంబర్‌లో 14 ఎకరాల ప్రభుత్వ భూమిలో సర్వే చేపట్టి అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణి కార్యాలయంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాజమణి, సునీత, రజిత, లలిత, అస్మా, పర్వవ్వ, సుకన్య, లక్ష్మి, రూప తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

ఎల్లారెడ్డిరూరల్: అల్మాజీపూర్‌లో మృతి చెందిన రొడ్డ నర్సింలు కుటుంబానికి మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

ట్రాఫిక్ సిబ్బందికి జాకెట్‌ల పంపిణీ

కామారెడ్డి క్రైం: పట్టణ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న బ్లూకోల్ట్ సిబ్బందికి ఎస్‌హెచ్‌వో నరహరి మంగళవారం జాకెట్‌లను అందజేశారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండే బ్లూకోల్ట్స్ సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో బ్లూకోల్ట్స్ జాకెట్‌లను అందిస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి రిఫ్లెక్షన్ జాకెట్ లను అందించామన్నారు. ట్రాఫిక్ ఎస్సై మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తాడ్వాయిలో రైతు నేస్తం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏవో నర్సిములు తెలిపారు. తాడ్వాయి, ఎర్రాపహాడ్, కన్‌కల్ రైతు వేదికల్లో ఉదయం 10 గంటలకు వీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం ఉంటుందన్నారు.

రెండు గ్లాసుల పద్ధతిని వీడాలి

నస్రుల్లాబాద్: ప్రజలు రెండు గ్లాసుల పద్ధతిని వీడాలని ఏఎస్సై రాజేంద్ర ప్రసాద్ అన్నారు. సోమవారం నెమ్లిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించి గ్రామస్తులకు హక్కుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంటరానితనం అమానుషం అన్నారు. హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి ఉపయోగించడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రజలంతా సమానమని చైతన్యపరిచారు. ఆర్‌ఐ వెంకటస్వామి, కానిస్టేబుల్ సాగర్ గౌడ్, గ్రామస్తులు అంజాగౌడ్, దస్తాగౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

అంటరానితనాన్ని రూపుమాపాలి

మద్నూర్(జుక్కల్): సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపాలని డోంగ్లీ ఆర్‌ఐ సాయిబాబా పేర్కొన్నారు. డోంగ్లీ మండల కేంద్రంలో సోమవారం సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు తన హక్కులను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి నెలా చివరి రోజున గ్రామాలలో సివిల్ రైట్స్‌డే కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

ఘనంగా రుద్రాభిషేకాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాన్ని వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజయ్య, మాజీ చైర్మన్ కొప్పుల నర్సారెడ్డి, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, మురికి కాలువ పనులు ప్రారంభం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆత్మకూర్‌లో సోమవారం ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో సీసీ రోడ్డు, మురికాలువ పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ఏఎంసీ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి గ్రామంలో ప్రత్యేక పూజలు చేసి పనులను ప్రారంభించారు. భాస్కర్‌రెడ్డి, సుభాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో మెహందీ

భిక్కనూరు: మండల కేంద్రంలోని శ్రీనగరేశ్వరాలయంలో ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మెహందీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు పబ్బ నాగరాజు, అధ్యక్షుడు పురాం రాజమౌళి, తదితరులున్నారు.

నేటి చిత్రం



రక్షణ కంచె ఏర్పాటు చేయండి

రామారెడ్డి: రామారెడ్డిలోని చింతలకుంటకు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎలాంటి రక్షణ కంచె లేకుండా ప్రమాదకరంగా ఉంది. ఈ దారి వెంట రైతులు పశువులను పొలాల్లోకి మేత కోసం ఎక్కువగా తీసుకెళ్తుంటారు. పశువులు ప్రమాదాలబారిన పడకుండా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలి.

– భైరయ్య, రైతు, రామారెడ్డి

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200
ఎల్లారెడ్డి : 97053 46576
బాన్సువాడ : 94402 11363
జుక్కల్ : 97053 46578

పింఛన్ డబ్బుల కోసం బారులు



దోమకొండలో పోస్టాఫీసు వద్ద గుమిగూడిన పింఛన్‌దారులు



లింగంపేటలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో పింఛన్ డబ్బులు తీసుకునేందుకు లబ్ధిదారులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. జూన్ 30 వరకు మాత్రమే పింఛన్ ఇస్తామని అధికారులు చెప్పడంతో పింఛన్‌దారులు గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పోస్టాఫీసుల వద్దకు బారులు తీరారు. చాలా మంది తమ బుక్కులను లైన్‌లో ఉంచారు. సదాశివనగర్ మండలం మోడెగాంలో పింఛన్ అందించే అధికారి రాకపోవడంతో వృద్ధులు అసహనం వ్యక్తం చేశారు. చాలా గ్రామాల్లో పింఛన్ల పంపిణీ విషయంలో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.



మోడెగాంలో జీపీ వద్ద నిరీక్షిస్తున్న వృద్ధులు



ఒడ్డేపల్లి జీపీ వద్ద..

పాఠశాలకు మరమ్మతులు చేయించాలి

ఎల్లారెడ్డిరూరల్: దేవునిపల్లి ప్రభుత్వ పాఠశాల భవనానికి మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు సోమవారం ఎంఈవో రాజులుకు వినతిపత్రం అందించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని పాఠశాల భవనానికి మరమ్మతులు చేయించాలని వారు కోరారు.



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న దేవునిపల్లి గ్రామస్తులు

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు

బాన్సువాడ రూరల్: మంగళవారం డాక్టర్స్ డే పురస్కరించుకుని ఓ రోజు ముందుగా బాన్సువాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. దేశాయిపేట్ జెడ్పీహైస్కూల్‌లో మాదక ద్రవ్యాలు-నష్టాలు అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోచారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిత్రలేఖనం, చిన్నరాంపూర్ జెడ్పీహైస్కూల్‌లో ప్లాస్టిక్ అనర్థాలపై ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.



రాంపూర్ పాఠశాలలో మొక్కలు నాటుతున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

దరఖాస్తుల విచారణ



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

నస్రుల్లాబాద్: నెమ్లి, దుర్కి గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను ఆర్‌ఐ వెంకట స్వామి విచారణ చేపట్టారు. గ్రామంలో జరిగిన సదస్సులో అందించిన దరఖాస్తుదారులను పిలిపించి పూర్తి వివరాలను సేకరించారు. సంబంధిత భూమి వివరాలను తెలుసుకుని నమోదు చేసుకున్నామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సూర్యకాంత్, పంచాయతి కార్యదర్శి హన్మవ్వ, రైతులు పాల్గొన్నారు.

ప్రమాదకర ప్రయాణం.. అదుపు తప్పితే అంతే

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రం నుంచి కామారెడ్డి వైపు ఐదుగురు యువకులు ఒకే బైక్‌పై ప్రమాదకరంగా ప్రయాణం చేశారు. నంబర్ లేని బైక్‌పై ఓవర్ స్పీడుగా వెళ్లడంతో ఇతర ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఒక వేళ అదుపు తప్పితే అంతే సంగతులని పలువురు అంటున్నారు. పోలీసులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తాడ్వాయిలో బైక్‌పై వెళ్తున్న ఐదుగురు యువకులు